నిధులున్నా.. అభివృద్ధి సున్నా!

- కాగితాలకే పరిమితమైన మోడ్రన్ వైకుంఠ ధామం
- పనులు ప్రారంభించడంలో అధికారుల నిర్లక్ష్యం
- ఆగిన ఈఎస్ఐ శ్మశానవాటిక అభివృద్ధి పనులు
- సౌకర్యాలు లేక అంత్యక్రియలకు వచ్చేవారికి అవస్థలు

సనత్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎంతో ఆర్భాటంగా మొదలు పెట్టిన ఈఎస్ఐసీ శ్మశాన వాటిక అభివృద్ధి పనులు నిలిచి పోయాయి. నిధులున్నా అధికారులు పట్టించుకోకపోవడంతో మోడ్రన్ వైకుంఠ ధామం నమూనా కాగితాలకే పరిమితమైంది. కరోనా తర్వాత ఈఎస్ఐసీ సత్యహరిశ్చంద్ర శ్మశాన వాటికను మోడ్రన్ వైకుంఠ ధామంగా మార్చేందుకు అందమైన నమూనాతో జీహెచ్ఎంసీ ప్రతిపాదనలు రూపొందించింది. అత్యాధునిక దహన వాటికలు, ఎలక్ట్రిక్ దహన వాటిక, అంత్యక్రియలకు హాజరయ్యే వారికి అవసరమైన సదుపాయాలు, వేచి ఉండే చోటుతోపాటు ఆహ్లాదకర మైన వాతావరణాన్ని కల్పించేందుకు ప్రాజెక్ట్‌ను తయారు చేశారు. ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ పరిస్థితి 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా తయారైంది.

● గత ప్రభుత్వ హయాంలో ఈఎస్ఐ శ్మశాన వాటికను అభివృద్ధి చేసేందుకు అప్పటి మంత్రి, స్థానిక ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ వివిధ అధికారులతో చర్చించి ప్రతిపాదనలు రూపొందించారు. ఈ ప్రాజెక్ట్ పూర్తి చేసేందుకు రూ. 5 కోట్ల నిధులు అవసరమని, ఏడాదిన్నర లోపు ప్రాజెక్ట్ పూర్తవుతుందని తెలిపారు. ఈ పనుల కోసం రూ. 2 కోట్ల నిధులు మంజూరైనా ఇప్పటి వరకు అధికారులు పనులను మాత్రం ప్రారంభించ లేదు.


మోడ్రన్ వైకుంఠ ధామం నమూనా

సౌకర్యాల లేమితో జూబ్లీహిల్స్, పంజాగుట్టలకు..

ఏడున్నర ఎకరాల్లో ఉన్న ఈఎస్ఐసీ శ్మశాన వాటికలో అన్నీ సమస్యలే . ఎన్నో ఏళ్ల క్రితం దాతల సహకారంతో ఏర్పాటు చేసిన దహన వాటికలు తప్ప ఎటువంటి అభివృద్ధి జరగలేదు. కోవిడ్ సమయంలో వివిధ ఆస్పత్రుల నుంచి మృతదేహాలను తీసుకువచ్చి ఇక్కడ దహనం చేయడతో ఈ శ్మశానవాటిక పేరు అందరికీ తెలిసింది. స్థలాభావంతో దహన వాటికల్లో కాకుండా కింద కూడా దహనాలు చేయడంతో రాష్ట్ర వ్యాప్తంగా అప్పట్లో చర్చంశనీయంగా మారింది. దాంతో అప్పటి మంత్రి, ఎమ్మెల్యే తలసాని అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. మోడ్రన్ శ్మశాన వాటికలా మార్చేందుకు తగిన ప్రణాళికలు రూపొందించారు. కానీ ప్రణాళికలు పేపర్‌కు మాత్రమే పరిమితం కావడంతో ఎలాంటి అభివృద్ధి జరగలేదు. సౌకర్యాలు లేకపోవడంతో కొందరు జూబ్లీహిల్స్, పంజాగుట్ట శ్మశాన వాటికలకు వెళ్తున్నారు.



నిరుపయోగంగా మారిన విద్యుత్ దహన వాటిక

నిరుపయోగంగా విద్యుత్ దహన వాటిక..

కాలుష్యరహితంగా దహన సంస్కారాలను నిర్వహించేందుకు ప్రత్యేకంగా ఈఎస్ఐ శ్మశాన వాటికలో విద్యుత్ దహన వాటికను ఏర్పాటు చేశారు. కోట్లాది ఖర్చుతో అందుబాటులోకి తెచ్చిన దహన వాటిక సరైన నిర్వహణ లేక నిరుపయోగంగా మారింది. అనాథ మృతదేహాల అంత్యక్రియల కోసం 2012లో జీహెచ్ఎంసీ ఈ విద్యుత్ దహన వాటికను నిర్మించింది. కొన్నాళ్లపాటు చాతీ, మానసిక చికిత్సాలయంతోపాటు నగరంలో అభ్యమైన అనాథ శవాలకు ఇక్కడ అంత్యక్రియలు నిర్వహించేవారు. కానీ ప్రస్తుతం నిర్వహణ లోపంతో మూలనపడింది. ఇప్పటికైనా అధికారులు పనులను ప్రారంభించాలని ప్రజలు కోరుకుంటున్నారు.

టి.అంజయ్య సేవలు చిరస్మరణీయం

ఎర్రగడ్డ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా టంగుటూరి అంజయ్య చేసిన సేవలు మరువలేనివని కాంగ్రెస్ పార్టీ నాయకులు కొనియాడారు. శుక్రవారం ఆయన వర్ధంతి సందర్భంగా లుంబినీ పార్కు వద్ద గల ఆయన విగ్రహానికి పలువురు కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, దళిత జాతి అభివృద్ధి కోసం టి.అంజయ్య ఎంతో కృషి చేశారన్నారు. దళితుల కోసం ఆయన ఎన్నో ప్రభుత్వ పథకాలను ప్రత్యేకంగా రూపొందించి వారి అభివృద్ధికి పాటుపడ్డారని కొనియాడారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నగర నాయకులు దూడల రవి గౌడ్, మొహమ్మద్ మోసిన్ ఖురేషి, కాంగ్రెస్ పార్టీ ఎర్రగడ్డ డివిజన్ మాజీ అధ్యక్షులు ఎర్ర కృష్ణ కుమార్, నాయకులు శశి కుమార్, హనుమంతరావు, నరేష్ పాల్గొన్నారు.


మాజీ ముఖ్యమంత్రి టి.అంజయ్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు రవి గౌడ్, మొహమ్మద్ మోసిన్, ఎర్ర కృష్ణ కుమార్ తదితరులు

పిల్లల్లో ఎముకల లోపాలను ఆరంభంలోనే గుర్తించాలి

- పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఎదుగుతున్న పిల్లల్లో తుంటి తొలగిపోవడం, విటమిన్-డి లోపం సమస్యలను ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స అందించాలని పీడియాట్రిక్ ఆర్థోపెడిక్ సర్జన్ డాక్టర్ విద్యాసాగర్ తెలిపారు. శుక్రవారం బేగంపేట్ కిమ్స్ సన్‌షైన్ ఆస్పత్రిలో పీడియాట్రిక్ బోన్ అండ్ జాయింట్ డేను పురస్కరించుకొని పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డాక్టర్ విద్యాసాగర్ చిన్నారులకు వైద్య పరీక్షలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విటమిన్-డి లోపం వల్ల ఎముకలు బలహీనపడడం (రికెట్స్) వంటి సమస్యలు తలెత్తుతాయన్నారు. దీంతో పిల్లల నీరసంగా ఉండడం, కాళ్లు, చేతులు వంకర పోవడం, కండరాలు పట్టేయడం వంటివి జరుగుతాయన్నారు. దీంతో వారు మెట్లు ఎక్కడం, దిగడం కూడా కష్టంగా మారుతుందన్నారు. ఇలాంటి ఇబ్బందులతో సతమతమవుతున్న చిన్నారులను ప్రాథమిక దశలోనే గుర్తించి సరైన చికిత్స అందజేస్తే శస్త్రచికిత్స వరకు వెళ్లకుండానే సమస్యను పరిష్కరించవచ్చని డాక్టర్ తెలిపారు. పిల్లలకు ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవాటు చేయాలని, మొబైల్ ఫోన్లు, ట్యాబ్ స్క్రీన్ చూసే సమయాన్ని సాధ్యమైనంత వరకు తగ్గించాలన్నారు. అలాగే, సూర్యకాంతి ఎక్కువ తగిలి శారీరక దారుఢ్యం పెరిగేందుకు చిన్నారులను క్రీడల్లో ప్రోత్సహించాలని డాక్టర్ విద్యాసాగర్ సూచించారు. పిల్లలకు పిజ్జాలు, బర్గర్లు, ఫ్రైఫుడ్స్, చక్కెర పానీయాలు వంటి ఆహారాలతో తయారైన ఆహారం ఇవ్వకుండా చూసుకోవాలన్నారు. ప్రతి రోజూ గంట పాటు ఆడటం వల్ల పిల్లల్లో ఎముకల అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.


అవగాహన కార్యక్రమంలో పిల్లలకు వైద్య పరీక్ష చేస్తున్న డాక్టర్ విద్యాసాగర్

ప్రపంచ నగరంగా మార్చాలనే మూసీ నది అభివృద్ధి

- సనత్‌నగర్ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ

బేగంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను ప్రపంచ నగరంగా మార్చాలనే లక్ష్యంతో మూసీ రివర్ ఫ్రంట్ డెవలప్మెంట్ ప్రాజెక్ట్‌కు ప్రభుత్వం కట్టుబడి ఉందని సనత్‌నగర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డా. కోట నీలిమ శుక్రవారం ఒక ప్రకటనలతో తెలిపారు. నగర వారసత్వం, ఆర్థిక వ్యవస్థ అభివృద్ధికి దోహదం చేయగల మూసీ అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కీలక చర్య తీసుకుందన్నారు. మూసీ నది పునరుజ్జీవన కోసం ఈనెల 21 నుంచి 24 వరకు మంత్రి నేతృత్వంలోని ఒక ప్రతినిధి బృందం దక్షిణ కొరియాలోని సియోల్‌ను సందర్శించనుందని పేర్కొన్నారు. కాగా, మూసీ ప్రాజెక్టు కారణంగా నిరాశ్రయులైన పేద కుటుంబాల పునరావాసం కోసం 15 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయిస్తూ అక్టోబరు 16న కాంగ్రెస్ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. అంతే కాకుండా వారికి ఆర్థి సాయం అందజేయడంతో పాటు వారి పిల్లల విద్యాభ్యాసం, వారికి సబ్సిడీతో రుణాలు అందజేసే విధంగా ప్రణాళికలు తయారు చేసిందన్నారు. ఫ్యూచర్ సిటీ, రీజనల్ రింగ్ రోడ్డు, మెట్రో విస్తరణ , ప్రపంచ స్థాయి స్టేడియాలు, నైపుణ్య విశ్వ విద్యాలయం వంటి ప్రధాన ప్రాజెక్టులతో హైదరాబాద్ ప్రపంచ పటంలో నిలుస్తుందని తెలిపారు.




సమావేశంలో మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు మర్రి పురురవారెడ్డి

బీజేపీ సభ్యత్వ నమోదును వేగవంతం చేయాలి

- మర్రి పురురవారెడ్డి

బేగంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదుకు మరో పది రోజులు అధిష్ఠానం గడువు పొడిగించి నందున సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని వేగంగా చేయాలని సనత్‌నగర్ బీజేపీ యువ నాయకుడు మర్రి పురురవారెడ్డి అన్నారు. గురువారం రాత్రి బేగంపేటలోని పార్టీ కార్యాలయంలో ఆయన పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికీ వెళ్లి పార్టీ సభ్యత్వ నమోదుకు కృషి చేయాలన్నారు. నగరంలోని సనత్‌నగర్ నగర్ నియోజకవర్గం పార్టీ సభ్యత్వ నమోదులో ముందుండాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు వి. సత్యనారాయణ, కుమార్, రఘునాథ్ గౌడ్, గోపి, గుంటి సత్యనారాయణ, వికాస్, శ్రీలత, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం

- సనత్‌నగర్‌లో మతిస్థిమితం సరిగా లేని మహిళ

సనత్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని మహిళ అదృశ్యమైన ఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది. సనత్‌నగర్ ప్రాంతంలో లక్ష్మీబాయి (75) భర్త తులసీరామ్‌తో కలిసి ఉంటోంది. ఆమెకు గత కొంత కాలంగా మతిస్థిమితం సరిగా ఉండటం లేదు. ఈనెల 13న లక్ష్మీబాయి ఎవరికీ చెప్పకుండా ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయింది. ఎంతకూ తిరిగి రాకపోవడంతో భర్త తులసీ రామ్ సనత్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.


లక్ష్మీబాయి

ఖైరతాబాద్‌లో విధులకు వెళ్లిన యువతి..

ఖైరతాబాద్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఉద్యోగానికి వెళ్తున్నాని ఇంటి నుంచి వెళ్లిన యువతి అదృశ్యమైన ఘటన ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం.. ఖైరతాబాద్ ప్రేం నగర్‌లో బిటిగిరి రమేష్ తన చెల్లెలు బిటిగిరి శ్వేత(23)తో కలిసి నివాసం ఉంటున్నాడు. శ్వేత ఓ ఆస్పత్రిలో హౌస్ కీపింగ్ పనులు చేస్తోంది. ఈనెల 15వ తేదీన ఆమె విధులకు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి బయలు దేరి వెళ్లి సాయంత్రం తిరిగి రాలేదు. ఆమె కోసం అంతటా వెతికినా ప్రయోజనం లేకపోవడంతో సోదరుడు రమేష్ ఖైరతాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.


శ్వేత

ఖైరతాబాద్ హోంగార్డు విజయనగరంలో మృతి

ఖైరతాబాద్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించే హోంగార్డు విజయనగరంలో మృతి చెందాడు. వివరాల ప్రకారం. ఖైరతాబాద్ ఠాణాలో శివగిరి (40) హోంగార్డు. గణపతి ఉత్సవాల సమయంలో తన భార్యకు ఆరోగ్యం బాగాలేదని హెడ్ క్వార్టర్స్‌లో సెలవు తీసుకొని విజయనగరానికి వెళ్లాడు. అప్పటి నుంచి విధు లకు హాజరు కాని శివగిరి విజయనగరం లోని ఓ కుంటలో మృతి చెంది ఉండగా కుటుంబీకులు గుర్తించి నట్టు తెలిసింది. ఈ సమాచారం శుక్రవారం పోలీస్‌స్టేషన్‌లో తెలియడంతో తోటి సిబ్బంది, అధికారులు విస్మయం వ్యక్తం చేశారు. శివగిరి ఆత్మహత్య చేసుకున్నాడా, ప్రమాదవశాత్తు చనిపోయాడా అనేది తెలియాల్సి ఉంది.


శివగిరి (ఫైల్)

'ప్రజావాణి' వల్లే పట్టా పాస్‌బుక్ వచ్చింది

- అధికారులను కలిసి సంతోషం వ్యక్తం చేసిన ఏదులాబాద్‌కు చెందిన దంపతులు

బేగంపేట, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రజా సమస్యల పరిష్కారం కోసం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ప్రజావాణి కార్యక్రమం వల్ల మేడ్చల్- మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం ఏదులాబాద్ గ్రామానికి చెందిన ఓ కుటుంబానికి ఇటీవల భూమి పట్టాదారు పాసు పుస్తకం అందింది. దీంతో శుక్రవారం మహాత్మాజ్యోతిబాపూలే ప్రజాభవన్‌లో శుక్రవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి ఏదులాబాద్ గ్రామానికి చెందిన వేణుగోపాల చారి, రుక్మిణి దంపతులు వచ్చి అధికారులను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. 2021 నుంచి 16 గుంటల భూమి ధరణిలో నమోదు కాలేదని, ధరణిలోని తప్పిదాల వల్ల అధికారులు తమకు పట్టా పాస్‌బుక్ ఇవ్వలేదన్నారు. గత మూడేళ్లుగా రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరిగి విసిగిపోయామని రుక్మిణి తెలిపారు. చివరగా న్యాయం కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నామని, ప్రజావాణి ఇన్‌చార్జి డా. చిన్నారెడ్డి, ప్రత్యేక అధికారి దివ్యలు చొరవ చూపడంతో ఇటీవల పాస్ పుస్తకం వచ్చిందని అన్నారు. తమ సమస్యను పరిష్కరించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ఈ సందర్భంగా రుక్మిణి ధన్యవాదాలు తెలిపారు.

ప్రజావాణికి 627 దరఖాస్తులు

శుక్రవారం నిర్వహించిన ప్రజావాణికి 627 దరఖాస్తులు వచ్చాయి. రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ చిన్నారెడ్డి, ప్రజావాణి ప్రత్యేక అధికారి దివ్యలు ప్రజల నుంచి అర్జీలను స్వీకరించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను తక్షణం పరిష్కరించేందుకు కృషి చేస్తామని ఈ సందర్భంగా వారు హామీ ఇచ్చారు. ఇళ్ల కోసం 185, సాంఘిక సంక్షేమ శాఖకు చెందిన 108, రెవెన్యూ శాఖకు 60, విద్యుత్ శాఖకు 57, ప్రవాసి (ఎన్.ఆర్.ఐ) విభాగానికి చెందిన 4, ఇతర శాఖలకు చెందిన 213 దరఖాస్తులు ప్రజావాణిలో వచ్చినట్లు అధికారులు తెలిపారు.


సంజీవరెడ్డినగర్‌లో ఆందోళన నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలి: ఏబీవీపీ

అమీర్‌పేట, అక్టోబరు18 (ఆంధ్ర జ్యోతి): పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్ మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని కోరుతూ కూకట్‌పల్లి, సికింద్రాబాద్ జిల్లా ఏబీవీపీ ఆధ్వర్యంలో శుక్రవారం సంజీవరెడ్డినగర్‌లో ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రోడ్డుపై బైఠాయించగా పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భంగా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్‌లో ఉన్న రూ. 7500 వేల కోట్ల స్కాలర్‌షిప్ నిధులను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలు మాట్లాడుతూ, పాలకులు మారినా ప్రజల బతుకులు మాత్రం మారడం లేదన్నారు. నియంత పోకడలు కారణంగా విద్యారంగం పూర్తిగా విధ్వంసం అవుతున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. .విద్యారంగానికి బడ్జెట్ కనీస నిధులు కేటాయించకపోవడం ఎంత వరకు సబబని ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్ఆర్ నగర్ టౌన్ సెక్రెటరీ నందు, అమీర్‌పేట టౌన్ సెక్రటరీ శ్రీరామ్, జాయింట్ సెక్రటరీ వంశీ, విజయ్, నరేష్, ఉదయ్, కార్తీక్, మోహన్, పవన్, ఏబీవీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.


'వాట్ హై-ఫై షో' ప్రదర్శిస్తున్న ఎలక్ట్రానిక్ సౌండ్ సిస్టమ్, టీవీ తదితరాలు

'వాట్ హై-ఫై షో 2024' ప్రారంభం

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఇళ్లనే థియేటర్‌గా మలుచుకుంటున్న కాలమిది. ఆడియోకు అమిత ప్రాధాన్యతనిస్తున్నారు. ఈ ఆడియో ప్రేమికుల అవసరాలను తీర్చడంతో పాటుగా సాంకేతిక ప్రేమికులను ఆకట్టుకోవడానికి మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో 'వాట్ హై-ఫై షో 2024' పేరిట ఆడియో-వీడియో ఉపకరణాల ప్రదర్శనను నిర్వహిస్తున్నారు. మూడు రోజుల పాటు జరిగే ఈ ప్రదర్శన శుక్రవారం ప్రారంభమైంది. అత్యాధునిక లేజర్ ప్రొజెక్టర్లు, డాల్బీ అట్మాస్ స్పీకర్ సిస్టమ్స్ సహా హై ఎండ్ ఆడియో, హెడ్ ఫోన్ ఆధారిత సిస్టమ్స్‌ను ఇక్కడ ప్రదర్శిస్తున్నారు. వాట్ హై-ఫై (ఇండియా) ఎడిటర్ నిశాంత్ మాట్లాడుతూ, హోమ్ థియేటర్, ఆడియో సిస్టమ్స్‌లో తాజా ఆవిష్కరణలతో పాటుగా ప్రొడక్ట్ డెమోలు, వర్క్‌షాప్‌లు, సలహాలు కూడా ఇవ్వనున్నామన్నారు. కార్పొరేట్ సంస్థల అవసరాలను తీర్చే రీతిలో ఇక్కడ ఉత్పత్తులు ఎక్కువగా ఉన్నాయన్నారు.

కాలుష్య రహిత తెలంగాణగా మార్చాలి

- సమావేశంలో వక్తల డిమాండ్

పంజాగుట్ట,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): తెలంగాణను కాలుష్య రహిత రాష్ట్రంగా మార్చాలని ఎన్విరాన్మెంట్ సోషల్ వర్కర్ పీఎల్ఎన్‌రావు, హైకోర్టు న్యాయవాది కె.రాజేష్ కుమార్‌లు అన్నారు. మూసీ ప్రక్షాళన, సుందరీకరణ కన్నా ముందు కాలుష్య నియంత్రణ మండలిని ప్రక్షాళన చేయాలని, హైడ్రాకు అదనపు అధికారులు ఇవ్వాలని వారు డిమాండ్ చేశారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో చౌటుప్పల్ మండలం ఆరేగూడెం మాజీ సర్పంచ్ మల్లేష్ యాదవ్, త్రిపురారం మండలం పెద్దదేవులపల్లి గ్రామానికి చెందిన ఠాకూర్ రాజారామ్ సింగ్, అంకిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన కాలుష్య వ్యతిరేక పోరాట సమితి అధ్యక్షుడు సీహెచ్ లింగారెడ్డిలతో కలిసి వారు మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మూసీ ప్రక్షాళన, సుందరీకరణను ప్రతిష్ఠాత్మకంగా చేపడుతూ నగర అభివృద్ధికి నిధులు ఖర్చు చేస్తున్నదని, దానికన్నా ముందు హుస్సేన్ సాగర్, మూసీ నది కలుషితానికి కారణమైన కాలుష్య నియంత్రణ మండలి(పీసీబీ)ని ప్రక్షాళన చేయాలని, అప్పుడే మూసీని కాలుష్యం బారి నుండి శాశ్వతంగా కాపాడుకోగలుగుతామన్నారు. పీసీబీలో జరుగుతున్న అవినీతి, అక్రమాలపై చర్యలు తీసుకో వాలని, ఈ విభాగాన్ని రద్దు చేసి హైడ్రాకు అదనపు అధికారులు కల్పించాలని అన్నారు. పటాన్‌చెరు, జీడిమెట్ల పారిశ్రామిక వాడలోని పరిశ్రమల నుంచి వెలువడే వ్యర్థాలు పూర్తి స్థాయిలో శుద్ధి చేయకుండా విడుదల చేయడంతో అవి నాలా ద్వారా నేరుగా మూసీలోకి చేరి భూగర్భ జలాలు కలుషితం అవుతున్నాయన్నారు. దీంతో నగరంతో పాటు ఉమ్మడి రంగారెడ్డి, నల్గొండ జిల్లాల ప్రజలు అనారోగ్యాల బారిన పడుతున్నారని,పంటలు పండటం లేదని, ప్రజలతో పాటు జంతువులు, పశువులు మృత్యువాత పడుతున్నాయన్నారు. చౌటుప్పల్‌లోని దివిస్ ల్యాబ్ వెదజల్లుతున్న కాలుష్యం వల్ల చుట్టుపక్కల ఉన్న 12కు పైగా గ్రామాల ప్రజలు తరుచూ అనారోగ్యం బారిన పడుతున్నారని అన్నారు. ఆ సంస్థ ఎండీ కొడుకు మాజీ మంత్రి కేటీఆర్‌కు స్నేహితుడు కావడంతో గత ప్రభుత్వం చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలు కాలుష్యం బారిన పడకుండా చర్యలు తీసుకోవాలన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయవాది రాజేష్ కుమార్

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పంజాగుట్ట,అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సంబంధిత మరమ్మతుల కారణంగా బంజారాహిల్స్ ఏడీఈ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏడీఈ జి.గోపి తెలిపారు. 11 కేవీ బంజారాహిల్స్ స్టార్ ఆసుపత్రి ఫీడర్ పరిధిలో ఉదయం 10 నుంచి ఉదయం 11 గంటల వరకు, 11 కేవీ ఐటీఏ ఫీడర్ పరిధిలో ఉదయం 10.30 నుంచి ఉదయం 11 గంటల వరకు, 11 కేవీ ఓబుల్ రెడ్డి స్కూల్‌నాందారి ఫీడర్ల పరిధిలో ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12 గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు. అలాగే, 11 కేవీ అయ్యన్న ఫ్రైడ్‌ఎల్వీ ప్రసాద్ మార్గ్ ఫీడర్ల పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, 11 కేవీ లుంబిని మాల్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు కరెంట్ సరఫరా ఉండదన్నారు. 11కేవీ కేబీఆర్ పార్కు ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు, 11 కేవీ మెరీడియన్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు కరెంట్ సరఫరాను నిలిపి వేస్తామని ఏడీఈ పేర్కొన్నారు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగాల పేరిట రూ. 26 లక్షల మోసం

- భార్యాభర్తలపై కేసు నమోదు

బంజారాహిల్స్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి వద్ద రూ. 26 లక్షలు వసూలు చేసి మోసం చేసిన భార్యాభర్తలపై క్రిమినల్ కేసు నమోదైంది. జూబ్లీహిల్స్ స్రవంతినగర్‌కు చెందిన అరెవరపు వాసు టీసీఎస్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడు. కొంత మంది స్నేహితులు తమకు కూడా ఉద్యోగాల్లో పెట్టించాలని అతడిని కోరారు. ఇదే తరుణంలో చల్లా శ్రీరాంకిరణ్ అనే వ్యక్తి వాసుకు పరిచయమయ్యాడు. టీసీఎస్‌తో పాటు ఐబీఎం లాంటి కంపెనీల్లో తనకు పలుకుబడి ఉందని, ఉద్యోగాల్లో పెట్టిస్తానని నమ్మబలికాడు. దీంతో వాసు తన స్నేహితుల నుంచి రూ. 26 లక్షలు వసూలు చేసి ఆ మొత్తాన్ని శ్రీరాంకిరణ్ పాటు అతడి భార్య సంధ్యారాణి ఖాతాల్లో జమ చేశారు. ఫిబ్రవరిలో ఉద్యోగాల్లో చేరేలా నకిలీ కాల్ లెటర్లను శ్రీరాం అందరికీ అందజేశాడు. అయితే, ఆయా కంపెనీలకు వెళ్లిన నిరుద్యోగులకు అవి నకిలీ కాల్ లెటర్స్ అని తేలింది. అప్పటి నుంచి డబ్బులు తిరిగి ఇచ్చేయాలని స్నేహితులు వాసుపై ఒత్తిడి తీసుకువచ్చారు. శ్రీరాంకిరణ్ ఉద్దేశపూర్వకంగా తన ద్వారా స్నేహితులను మోసం చేశాడని పేర్కొంటూ వాసు జూబ్లీహిల్స్ పోలీసు లకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ

వ్యర్థాలను రోడ్లపై వేస్తే చట్ట ప్రకారం చర్యలు

- హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులకు మధురానగర్ ఇన్‌స్పెక్టర్ హెచ్చరిక

వెంగళరావునగర్, అక్టోబరు18 (ఆంధ్రజ్యోతి): వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయొద్దని మధురానగర్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ వర్మ సూచించారు. శుక్రవారం మధురానగర్‌లోని సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్ ఆవరణలో పోలీస్ స్టేషన్ పరిధిలోని హోటళ్లు, రెస్టారెంట్లు, మటన్, చికెన్, బీఫ్ దుకాణాల నిర్వాహకులతో ఆయన సమావేశమయ్యారు. వ్యాపారులు, నిర్వాహకులు మాసం, ఇతర వ్యర్థాలను ఒక ప్లాస్టిక్ సంచిలో వేసి వాటిని జీహెచ్ఎంసీ పారిశుద్ధ్య వాహనాల వారికి అందజేయాలన్నారు. నిబంధనలు పాటించని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో ఎస్ఐలు సాయినాథ్ రెడ్డి, అవినాష్, హోటళ్ల నిర్వాహకులు పాల్గొన్నారు.

బదిలీలు పూర్తి.. పరిపాలనపై దృష్టి

- సర్కిళ్ల వారీగా ఏఈ నుంచి ఎస్ఈలతో సమీక్షలు
- సెక్షన్ స్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టనున్న సీఎండీ

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థలో ఓ అండ్ ఎం సిబ్బందితో పాటు ఇంజినీర్లు, చీఫ్ ఇంజినీర్ల (సీఈ)ల బదిలీల ప్రక్రియ ముగియడంతో దక్షిణ డిస్కం సీఎండీ ముషారఫ్ ఫరూఖీ పరిపాలనపై దృష్టిసారించారు. ఏఈ నుంచి ఏడీఈ, డీఈలతో సీఈల వరకు అన్ని విభాగాల్లో భారీగా మార్పులు చేపట్టిన సీఎండీ సర్కిళ్ల వారీగా అన్ని విభాగాల అధికారులతో సమీక్షలు నిర్వహిస్తూ, సెక్షన్ స్థాయిలో ఆకస్మిక తనిఖీలు చేపట్టే దిశగా చర్యలు చేపడుతున్నారు. కొత్త విద్యుత్ కనెక్షన్ల జారీ మొదలు ఎస్టిమేషన్లు, విద్యుత్ లైన్‌షిఫ్టింగ్ పనులు, డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులను నేరుగా సీఎండీ సమీక్షించనున్నారు. సమ్మర్ యాక్షన్ ప్లాన్‌లో భాగంగా చేపడుతున్న పనులను డిసెంబరు నాటికి పూర్తి చేయాలని ఇప్పటికే సీఎండీ ఉన్నతాధికారులను ఆదేశించారు. మెట్రో, రంగారెడ్డి, మేడ్చల్ జోన్లలో ఇంజినీరింగ్ విభాగంలో భారీ మార్పులు జరిగిన నేపథ్యంలో విద్యుత్ సరఫరా, బిల్లుల వసూళ్లపై ఎలాంటి ప్రభావం పడకుండా చర్యలు తీసుకుంటున్నారు.





నెక్లెస్ రోడ్‌లోని పీపుల్స్ ప్లాజాలో టాటా మోటార్స్ షోలో ప్రదర్శనకు ఉంచిన కొత్త మోడల్ వాహనాలు, వాటిలోని ఇంజిన్ల పని తీరును సందర్శకులకు వివరిస్తున్న సిబ్బంది

భోజనం చేసి వచ్చే సరికి కారులోని నగలు మాయం

బంజారాహిల్స్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): కారును పార్కింగ్‌లో పెట్టి రెస్టారెంట్‌కు వెళ్లొచ్చేసరికి నగలు కనిపించకుండాపోయాయి. పంజాగుట్ట కాలనీకి చెందిన వైవీ మూర్తి ఈ నెల 15న వజ్రాల బంగారు చెవిదిద్దులు, వజ్రాల గొలుసు... మొత్తం వంద గ్రాముల అభరణాలను ఓ ప్లాస్టిక్ కవర్‌లో పెట్టి తన మారుతీ 800 కారులో భద్రపరిచాడు. అనంతరం భార్యతో జూబ్లీహిల్స్ రోడ్డు నంబరు 10లోని జామున్ హోటల్‌కు భోజనం చేసేందుకు వెళ్లాడు. నగలు ఉన్నాయన్న విషయం మరిచి కారును వాలెట్ పార్కింగ్‌కు ఇచ్చాడు. భోజనం ముగించుకొని వచ్చి చూడగా కారులోని నగలు కనిపించలేదు. వాలెట్ పార్కింగ్ సిబ్బందిని అడగ్గా తమకు తెలియదని చెప్పారు. దీంతో ఈ నెల 17న బాధితుడు జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పని భారం తగ్గించాలి.. వారంలో 30 గంటలు విశ్రాంతి ఇవ్వాలి

● 8 గంటల పని విధానాన్ని 6 గంటలకు మార్చాలి: ఆల్ ఇండియా రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జిలాని

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): రైల్వే ఉద్యోగులకు పనిభారం తగ్గించాలని, వారంలో 30 గంటలు విశ్రాంతిని ఇవ్వాలని ఆల్ ఇండియా రన్నింగ్ స్టాఫ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జిలాని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సికింద్రాబాద్ రైల్ నిలయం ఎదురుగా రైల్వే ఉద్యోగులు నిరసన, ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రయాణికుల భద్రతకోసం శ్రమించి రైల్వే రంగంలో పనిచేస్తున్నామన్న ఆయన, రన్నింగ్ స్టాఫ్‌లో పనిచేస్తున్న రైల్వే ఉద్యోగులకు 30 గంటల విశ్రాంతి ఇవ్వాలన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న 8 గంటల పనివిధానాన్ని 6 గంటలకు మార్చాలన్నారు. కొన్నేళ్లుగా తమ డిమాండ్లను పరిష్కరించాలని ఆల్ ఇండియా లెవల్ ప్రధాన డివిజన్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిరసనలు వ్యక్తం చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం, రైల్వే అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్లను అమలు చేయాలని కోర్టులు చెబుతున్నా, రైల్వే అధికారులు మాత్రం అమలు చేయడంలేదన్నారు.



రైల్ నిలయం ఎదుట ధర్నా చేస్తున్న ఆల్ ఇండియా రన్నింగ్ స్టాఫ్ ఉద్యోగులు

మరోవైపు కార్మిక శాఖ అధికారులు స్పందించి రైల్వే ఉద్యోగులకు పనిగంటలు తగ్గించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినప్పటికీ రైల్వే అధికారులు అమలు చేయడంలేదన్నారు. ఈ ధర్నాలో ఆల్ ఇండియా నుంచి పలు డివిజన్ స్థాయిలో ధర్నాలో పాల్గొనడం జరిగిందన్నారు. అనేకసార్లు రైల్వే జీఎంతో పాటు సంబంధిత అధికారులకు వినతి పత్రాలు సమర్పించినప్పటికీ కేంద్ర రైల్వే శాఖ జాప్యం చేస్తుందన్నారు.

18 ఏళ్లుగా పనిచేస్తున్నాం.. జీతాలు పెంచండి

● ఉస్మానియాకు ఒక న్యాయం, గాంధీకి మరో న్యాయమా? : ఔట్‌సోర్సింగ్ పారామెడికల్ టెక్నీషియన్లు

అడ్డగుట్ట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): 'పారామెడికల్ ఔట్‌సోర్సింగ్ విభాగంలో 18 ఏళ్లుగా పనిచేస్తున్నాం. జీతాలు పెంచండి' అని పారామెడికల్ టెక్నీషియన్లు కోరారు. ఈ మేరకు శుక్రవారం గాంధీ ఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సునీల్‌కుమార్‌ను కలిసి వారు వినతిపత్రం అందజేశారు. అనంతరం పలువురు టెక్నీషియన్లు మీడియాతో మాట్లాడుతూ 18 ఏళ్లుగా పనిచేస్తున్నా తమకు ఇప్పటి వరకు జీతాలు పెంచలేదన్నారు. ఉస్మానియా ఆస్పత్రిలో పారామెడికల్ టెక్నీషియన్లకు జీతాలు పెరిగాయని, గాంధీ ఆస్పత్రిలో పనిచేస్తున్న తమకు మాత్రం జీతాలు పెరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉస్మానియా ఆస్పత్రికి ఒక న్యాయం, గాంధీ ఆస్పత్రికి మరో న్యాయమా అని వారు ప్రశ్నించారు. ప్రస్తుతం గాంధీ ఆస్పత్రిలో పనిచేస్తున్న తమకు నెలకు రూ.15 వేలు మాత్రమే జీతాలు ఇస్తున్నారని, తమకు జీతాలు పెంచి నెలకు రూ. 25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గాంధీ ఆస్పత్రి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు ఆరోగ్యశ్రీ నిధుల నుంచి పొందుతున్న సిబ్బందికి పీఆర్‌సి ప్రకారం జీతాలు చెల్లించాలి, సిబ్బందిని 300ఓసీఎస్‌లోకి మార్చాలన్నారు. గాంధీ ఆస్పత్రిలో వివిధ విభాగాలలో ఔట్‌సోర్సింగ్ కింద 37 మంది పనిచేస్తున్నామన్నారు. నిలోఫర్, ఉస్మానియాలో పనిచేస్తున్నవారికి జీవో 60,63 ప్రకారం జీతాలు పెంచారని, గాంధీ ఆస్పత్రిలో పనిచేస్తున్న తమకూ 60,63 ప్రకారం జీతాలు పెంచాలన్నారు. తక్కువ జీతాలతో పనిచేస్తున్నామని తమకు ఇప్పటి వరకు ఏ జీవో లేదన్నారు. జీతాలు పెంచి 300 ఓసీఎస్‌లోకి కన్వర్ట్ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ధర్నాలు, నిరసనలు చేస్తామని వారు హెచ్చరించారు. డిప్యూటి సూపరింటెండెంట్‌ను కలిసిన వారిలో టెక్నీషియన్లు ఖాలీద్, మన్సూర్, హరికృష్ణ, ప్రవీణ్, సోమన్న, శ్రీనివాస్ తదితరులున్నారు.



గాంధీ డిప్యూటీ సూపరింటెండెంట్ సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న పారామెడికల్ విభాగం టెక్నీషియన్లు

పేదలకు అండగా ఉంటా: ఎమ్మెల్యే పద్మారావు

బౌద్ధనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని పేద ప్రజలకు అండగా ఉంటానని సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ అన్నారు. శుక్రవారం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పలువురు కార్పొరేటర్లతో కలిసి పద్మారావుగౌడ్ సీఎం సహాయనిధి, కల్యాణలక్ష్మి చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. దాదాపు రూ. 20 లక్షల చెక్కులను 55 మంది లబ్ధిదారులకు అందజేశారు. అనంతరం పద్మారావు మాట్లాడుతూ ఆడపిల్లల పెళ్లికి కల్యాణలక్ష్మి, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి సీఎం రిలీఫ్ ఫండ్‌తో మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో యువనేతలు తీగుళ్ల రామేశ్వర్‌గౌడ్, సుంకు రామచందర్, కార్పొరేటర్లు సామల హేమ, కంది శైలజ, రాసూరి సునీత, లింగాని ప్రసన్నలక్ష్మీ, మాజీ కార్పొరేటర్ కంది నారాయణ, కరాటేరాజు, అశ్విన్ తదితరులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కును అందజేస్తున్న పద్మారావు

హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడమే లక్ష్యం

సికింద్రాబాద్/బేగంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోటా నీలిమ తెలిపారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉన్నదని ఆమె అన్నారు. మూసీ రివర్ ఫ్రంట్ ప్రాజెక్టు కేవలం సుందరీకరణను మాత్రమే కాకుండా నది పునరుజ్జీవనాన్ని కూడా లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. ప్రాజెక్టు కారణంగా నిరాశ్రయులైన పేదకుటుంబాల పునరావాసం కోసం 15 వేల డబుల్‌బెడ్ రూమ్ హౌజింగ్ యూనిట్లను కేటాయిస్తూ ఈనెల 16న తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడాన్ని శుక్రవారం ఆమె ఓ ప్రకటనలో స్వాగతించారు. ఫ్యూచర్ సిటీ, రీజినల్ రింగ్‌రోడ్, మెట్రో విస్తరణ, ప్రపంచస్థాయి స్టేడియాలు, నైపుణ్య విశ్వవిద్యాలయం తదితర ప్రధాన ప్రాజెక్టులతో హైదరాబాద్ నగరం ప్రపంచపటంలో స్థానం పొందనున్నదని డాక్టర్ కోటా నీలిమ పేర్కొన్నారు.



సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ

ప్రజలకు ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలి

సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

మారేడుపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఫుట్‌పాత్‌లపై పాదచారులకు, వాహనదారులకు ఇబ్బందులు కలగకుండా వ్యాపారాలు చేసుకోవాలని సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ సూచించారు. శుక్రవారం వెస్ట్ మారేడుపల్లిలోని క్యాంపు కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ నామన శేషు కుమారి అధ్వర్యంలో కనకదుర్గమ్మ ఆలయం, మైత్రీవనం ప్రాంతాలలో ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకుంటున్న పలువురు ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్‌ను కలిశారు. ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలు చేసుకోకుండా ట్రాఫిక్ పోలీసులు దుకాణాలను తొలగిస్తున్నారని ఎమ్మెల్యేకు వివరించారు. స్పందించిన తలసాని ట్రాఫిక్ పోలీస్ ఉన్నతాధికారులతో మాట్లాడి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా వ్యాపారాలు చేసుకోవాలని వారికి సూచించారు. వ్యాపారులు మార్కింగ్‌కు లోపలే ఉండి వ్యాపారాలు చేసుకుంటే ట్రాఫిక్ సమస్యలు తలెత్తవన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో చిరువ్యాపారులు శ్రీనివాస్, శివ, సంపత్, అనిల్, రామకృష్ణ, కృష్ణ, రాణి కౌర్ తదితరులు ఉన్నారు.



రైల్వే ఫ్రంట్‌లైన్ సిబ్బందికి వర్క్‌షాప్

హైదరాబాద్, అక్టోబర్ 18(ఆంధ్రజ్యోతి): రైల్వేలో అసాధారణ పరిస్థితుల్లో ప్రయాణికులను రక్షించేందుకు తీసుకోవలిసిన చర్యలపై మౌలాలీలోని జోనల్ రైల్వే ఇనిస్టిట్యూట్‌లో శుక్రవారం వర్క్‌షాప్ నిర్వహించారు. దక్షిణమధ్య రైల్వే క్లెయిమ్స్ బ్రాంచ్ కమర్షియల్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో జరిగిన వర్క్‌షాప్‌లో సుమారు 250 మంది స్టేషన్ మేనేజర్లు, లోకో పైలట్లు, రైలు మేనేజర్లు పాల్గొన్నారు. మరణాలకు దారితీసే అసాధారణ సంఘటనలను ఎదుర్కోవడంలో ఫ్రంట్‌లైన్ సిబ్బందికి అవగాహన కల్పించడానికి భద్రతా అంశానికి సంబంధించి ఈ వర్క్‌షాప్‌ను నిర్వహించినట్టు దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ ఆపరేషన్స్ మేనేజర్ బి. నాగ్య తెలిపారు.

ప్రజలు ఆరోగ్యంపట్ల శ్రద్ధ వహించాలి: కార్పొరేటర్ హేమలత

పద్మారావునగర్, అక్టోబర్ 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని బన్సీలాల్‌పేట డివిజన్ కార్పొరేటర్ కుర్మ హేమలత సూచించారు. జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్ అండ్ రీసెర్చ్ ఆధ్వర్యంలో బన్సీలాల్‌పేట్ సేవా సంఘం కమ్యూనిటీ హాలులో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన కార్పొరేటర్ వైద్య శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడారు. అనారోగ్యం పాలు కాకుండా వైద్యులను సంప్రదించి తరచూ పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఆర్థోపెడిక్, జనరల్ ఫిజీషియన్, గైనకాలజీ, పిడియాట్రిక్ విభాగాల వైద్యులు పాల్గొని వైద్య పరీక్షలు చేశారు. దాదాపుగా 165 మందికి రక్తపోటు, మధుమేహం పరీక్షలు నిర్వహించి మందులను అందజేశారు. భారత్ వికాస్ పరిషద్ ద్వారా 95 మంది మహిళలకు పరీక్షలు నిర్వహించి, రక్తతహీనత ఉన్నవారికి ఐరన్, పోలిక్ ఆసిడ్ మాత్రలను అందజేశారు. శిబిరంలో జనహిత సేవా ట్రస్ట్ ప్రతినిధులు నర్సింహమూర్తి, వెంకటనారాయణ, కిమ్స్ ఫౌండేషన్ కో-ఆర్డినేటర్ విక్రమ్, బన్సీలాల్‌పేట్ సేవా సంఘం అధ్యక్షుడు మోహన్‌రావు,ప్రధాన కార్యదర్శి రంగారావు, జగదీశ్, ఆరోగ్య శిబిరం కో-ఆర్డినేటర్ నర్సింగరావ, బీఆర్‌ఎస్ నాయకులు లక్ష్మీపతి, ఫిజియోథెరపిస్ట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



ప్రజలకు పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు, పక్కన కార్పొరేటర్ హేమలత

ఫుట్‌పాత్‌లపై దుకాణాలు, తోపుడు బండ్ల తొలగింపు

బౌద్ధనగర్, అక్టోబరు18(ఆంధ్రజ్యోతి): ప్రధానరహదారిలో ఫుట్‌పాత్‌పై ఇరువైపులా రోడ్డును అక్రమించి, అక్రమంగా ఏర్పాటె చేసిన తోపుడుబండ్లను, దుకాణాలను చిలకలగూడ ట్రాఫిక్ పోలీసులు శుక్రవారం తొలగించారు. ఈస్ట్‌జోన్ అసిస్టెంట్ కమిషనర్ సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాసులు ఆధ్వర్యంలో ఆపరేషన్ రోప్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. చిలకలగూడ గాంధీబొమ్మ నుంచి మైలార్‌గడ్డ చౌరస్తా వరకు ఫుట్‌పాత్‌లపై అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలు, తోపుడు బండ్లను తొలగించి వ్యాపారులకు చలాన్‌లను విధించారు. తొలగింపు పనుల్లో ట్రాఫిక్ ఎస్సైలు, కానిస్టేబుల్స్, సిబ్బంది పాల్గొన్నారు.



దుకాణాలను తొలగిస్తున్న పోలీసులు

మతిస్థిమితంలేని మహిళ అదృశ్యం

సనత్‌నగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితంలేని మహిళ అదృశ్యమైన సంఘటన సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో నమోదైంది. సనత్‌నగర్ ప్రాంతానికి చెందిన లక్ష్మీబాయి(75) భర్త తులసీరామ్‌తో కలిసి ఉంటోంది. ఆమెకు కొంత కాలంగా మతిస్థిమితం సరిగా లేదు. ఈనెల 13న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగిరాలేదు. బంధువులు, తెలిసిన వారి ఇళ్లల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. భర్త తులసీరామ్ శుక్రవారం సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



లక్ష్మీబాయి

భక్తుల మనోభావాలను దెబ్బతీయొద్దు: మాజీ ధర్మకర్త

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అమ్మవారిని దర్శించుకుని అన్నప్రసాదం స్వీకరిస్తామని వచ్చిన భక్తులకు ఆలయ అధికారులు, సిబ్బంది తీరుతో మనోవేదనకు గురయ్యారు. శుక్రవారం సంతోషిమాత ఆలయానికి వచ్చిన భక్తులకు టోకెన్ తీసుకున్న వారి తర్వాతనే అన్నప్రసాద స్వీకరణకు సాధారణ భక్తులను అనుమతిస్తామని చెప్పడంతో నిరాశకు గురయ్యారు. గమనించిన మాజీ ధర్మకర్త రాము భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా ప్రవర్తించడం సరికాదని ఈవోను నిలదీశారు.

ఉద్యాపన టోకెన్ తీసుకున్న వారిని, సాధారణ భక్తులను వేరుగా చూడొద్దని, గతంలో మాదిరిగా అందరికి సమానంగా అన్నప్రసాదం అందించాలని డిమాండు చేశారు. దాతలు అన్నదానానికి నిధులు ఇస్తున్నారని, అవసరం అయితే ఎక్కువ మందికి అందించేలా అన్నప్రసాదం సిద్ధం చేయాలని అన్నారు. దీంతో కొద్దిసేపు ఇరువురి మధ్య వాగ్వివాదం జరిగింది. ఈ విషయంపై'ఆంధ్రజ్యోతి'ఈవో మహేందర్‌గౌడ్‌ను వివరణ కోరగా ఉద్యాపన టోకెన్ రూ. 300 చెల్లించిన ప్రాధాన్యం ఇచ్చి తరువాత మిగతా భక్తులకు అందిస్తామని చెప్పారు. వచ్చే వారం నుంచి అన్నప్రసాదం టోకెన్‌లు పంపిణీ చేస్తామని టోకెన్‌లు ఉన్నవారికి అన్నప్రసాదం అందేలా చర్యలు తీసుకుంటానని ఈవో తెలిపారు.



అన్నప్రసాదం కోసం ఆలయంలో వేచి ఉన్న భక్తులు

అడ్డగుట్ట డివిజన్‌లో మహిళా భవన్ ఏర్పాటు చేయాలి

అడ్డగుట్ట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): అడ్డగుట్ట డివిజన్‌లో మహిళా భవన్ ఏర్పాటు చేయాలని రుద్రవీణ మహిళా సంఘం వ్యవస్థాపక అధ్యక్షురాలు ఎస్. శోభ కోరారు. ఈ మేరకు శుక్రవారం ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం అడ్డగుట్టలోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరులు సమావేశంలో శోభ మాట్లాడుతూ మారేడుపల్లి రెవెన్యూ కార్యాలయానికి కొద్ది దూరంలో ఖాళీ స్థలం ఉన్నదని, మహిళా భవన్ కోసం స్థలం కేటాయించాలని గతంలో జీహెచ్‌ఎంసీ అధికారులకు లేఖ అందజేయగా, వారు సర్వే కూడా చేశారని అన్నారు. అనంతరం గత ప్రభుత్వం ఆ విషయాన్ని మర్చిపోయిందని, ప్రస్తుత ప్రభుత్వం సీఎం రేవంత్‌రెడ్డి స్పందించి మహిళా భవన ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. అడ్డగుట్టలో దాదాపు 120 మహిళా సంఘాలు ఉన్నాయని, వారు సమావేశాలు ఏర్పాటు చేసుకోవడానికి భవనం లేక ఇబ్బందులు పడుతున్నట్టు మంత్రి సీతక్కకు వివరించగా సానుకూలంగా స్పందించారని ఆమె తెలిపారు. మంత్రి సీతక్కన కలిసిన వారిలో సంఘం సభ్యురాళ్లు భాగ్యలక్ష్మీ, జమున, మమత, లక్ష్మీ, కాంగ్రెస్ పార్టీ గ్రేటర్ కన్వీనర్ డి. రామలీల ఉన్నారు.



ప్రజాభవన్‌లో మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేస్తున్న రుద్రవీణ మహిళా సంఘం ప్రతినిధులు

దురంతో రైలులో ఆర్మీ ఉద్యోగి

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): వైద్యం చేయించుకుని రైలులో వస్తున్న ఆర్మీ ఉద్యోగి అదృశ్యమయ్యాడు. సికింద్రాబాద్ రైల్వే ఎస్‌ఐ రమేష్ తెలిపిన వివరాల ప్రకారం... సికింద్రాబాద్ తిరుమలగిరి ఆర్మీ రేంజ్‌లోని ఎంసీఈఎంఈ సెంటర్‌లో సతీష్‌కుమార్(35) విధులు నిర్వహిస్తున్నాడు. అనారోగ్యంతో తిరుమలగిరిలోని మిలటరీ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నాడు. అయినా వ్యాధి నయం కాకపోడంతో అక్కడి వైద్యులు పుణెలోని మిలటరీ ఆస్పత్రికి సిఫారస్ చేశారు. వారం రోజుల క్రితం సతీష్‌కుమార్, తోటీ ఆర్మీ పోలీస్ అధికారి ధర్మరాజ్‌సింగ్‌తో కలిసి పుణె మిలటరీ ఆస్పత్రికి వెళ్లారు. అక్కడ వైద్యం చేయించుకుని ఈ నెల 17 దురంతో ఎక్స్‌ప్రెస్ రైలులో సికింద్రాబాద్‌కు బయలుదేరారు. రైలు బేగంపేట స్టేషన్‌కు రాగానే మూత్రం వస్తుందని సతీష్‌కుమార్ తోటి ఆర్మీ అధికారితో చెప్పి వెళ్లాడు. ఈలోగా రైలు సికింద్రాబాద్ స్టేషన్‌కు చేరుకుంది. సతీష్‌కుమార్ కనిపంచకపోవడంతో ధర్మరాజ్‌సింగ్ సికింద్రాబాద్ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.



సతీష్‌కుమార్

విద్యార్థుల పెండింగ్ ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలి

అమీర్‌పేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న విద్యార్థుల ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను వెంటనే విడుదల చేయాలని ఏబీవీపీ డిమాండ్ చేసింది. శుక్రవారం సంజీవరెడ్డినగర్‌లో కూకట్‌పల్లి, సికింద్రాబాద్ జిల్లా ఏబీవీపీ ఆధ్వర్యంలో ధర్నా, ర్యాలీ నిర్వహించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం ప్రధాన రోడ్డుపై బైఠాయించగా అక్కడే ఉన్న పోలీసులు వారిని అరెస్టు చేశారు. ఈ సందర్భం గా ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి శ్రీనాథ్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న విద్యార్థులకు సంబంధించి రూ.7,500 కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సికింద్రాబాద్ జిల్లా కన్వీనర్ బాలు మాట్లాడుతూ పాలకులు మారినా విద్యార్థులు, ప్రజల బతుకులు మారడం లేదన్నారు. నియంత పోకడల కారణంగా విద్యారంగం పూర్తిగా ధ్వంసం అవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో విద్యారంగానికి కనీస నిధులు కేటాయించకపోవడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో ఎస్‌ఆర్‌నగర్ టౌన్ సెక్రెటరీ నందు, అమీర్‌పేట్ టౌన్ సెక్రటరీ శ్రీరామ్, జాయింట్ సెక్రటరీ వంశీ, విజయ్, నరేష్, ఉదయ్, కార్తీక్, మోహన్,పవన్ తదితరులు పాల్గొన్నారు.



సంజీవరెడ్డినగర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న ఏబీవీపీ నాయకులు

విజ్ఞానాన్ని భావితరాలకు అందించాలి

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): విజ్ఞానాన్ని భావితరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉన్నదని ఇఫ్లూ రిటైర్డ్ ప్రొఫెసర్, డీన్ సుధాకర్ అన్నారు. శుక్రవారం సికింద్రాబాద్ సెయింట్ ఆన్స్ బీఈడీ కాలేజీలో రెండు రోజులపాటు నిర్వహించనున్న సెమినార్‌లో మొదటిరోజు ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన కీనోట్ ప్రసంగం చేశారు. విద్యార్థులకు రామాయణం, భారతం, పంచతంత్రం వంటివి బోధించాలని అన్నారు. వాటిలో మన జీవన విధానం, ఎలా నడుచుకోవాలో తెలియజేసే ఎన్నో అంశాలు ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో ఓయూ ఎడ్యుకేషన్ విభాగం అధిపతి ప్రొఫెసర్ మృణాలిని, ప్రిన్సిపాల్ మేరి కుట్టీ, వైస్‌ప్రిన్సిపాల్ ఆంతోనియా పాల్గొన్నారు.



ప్రసంగిస్తున్న సుధాకర్

కట్టమైసమ్మ ఆలయంలో ట్రాఫిక్ పోలీసుల పూజలు

బౌద్ధనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ కట్టమైసమ్మ, నల్లపోచమ్మ ఆలయాన్ని చిలకలగూడ ట్రాఫిక్ ఏసీపీ వి.సంపత్ కుమార్, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.శ్రీనివాసులు శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా కట్టమైసమ్మ, నల్లపోచమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ చైర్మన్ గుంటి కృష్ణ, ఈవో మహేందర్‌గౌడ్ వారిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు జంగిలి దేవేందర్‌యాదవ్, ఎం.జగన్‌రెడ్డి, బి.శ్రీనివాస్, ఎం.అమృత్, ఎస్.జానకీ పాల్గొన్నారు.



ఆలయంలో పూజలు చేస్తున్న ట్రాఫిక్ ఏసీపీ సంపత్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

క్రీడలు దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తాయి: కొత్త సంజీవరెడ్డి

మారేడుపల్లి, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): క్రీడలు దేశ ప్రతిష్ఠను ఇనుమడింపజేస్తాయని టీజీఆర్టీసీ సంస్థ మాజీ చైర్మన్ కొత్త సంజీవరెడ్డి చెప్పారు. మహర్షి వాల్మీకి జయంతి సందర్భంగా ఈ నెల 16, 17 తేదీలలో మారేడపల్లిలోని షెనాయ్ జీహెచ్‌ఎంసీ క్రీడా మైదానంలో సాగర్, బబ్లూ, సాయి, రంజిత్ అధ్వర్యంలో క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఫైనల్‌లో 11 స్టార్స్ ఓయూ జట్టు విజేతగా నిలవగా, రన్నర్‌ఎతో సాయి 11 గాంధీనగర్ జట్టు సరిపెట్టుకుంది. శుక్రవారం ముగింపు కార్యక్రమంలో ముఖ్యఅతిథులుగా పాల్గొన్న కొత్త సంజీవరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకుడు గజ్వేల్ భరత్ విజేత జట్టుకు ట్రోఫీ అందజేశారు. కార్యక్రమంలో విశాల్, సాగర్, సాయి, రాహుల్, రంజీత్ తదితరులు పాల్గొన్నారు.



విజేత జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న కొత్త సంజీవరెడ్డి, గజ్వేల్ భరత్

ప్రజలు స్వచ్ఛందంగా బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారు

చిలకలగూడ, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ప్రజలు స్వచ్ఛందంగా ముందుకొచ్చి బీజేపీ సభ్యత్వం తీసుకుంటున్నారని ఆపార్టీ మహాకాళీ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సారంగపాణి అన్నారు. శుక్రవారం మెట్టుగూడ డివిజన్ దూద్‌బావిలో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. సికింద్రాబాద్ నియోజకవర్గంలో 50 వేలు సభ్యత్వాలు చేస్తామని సారంగపాణి అన్నారు. కార్యక్రమంలో కుమార్, ప్రతాప్, సాయి, వరుణ్ తదితరులు పాల్గొన్నారు.



సభ్యత్వాలు అందజేస్తున్న మేకల సారంగపాణి

'వీరభద్రీయ కులస్థుల సమస్యలు పరిష్కరించండి'

బౌద్ధనగర్, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బీసీ ఫైనాన్స్ రాష్ట్ర చైర్మన్ నూతి శ్రీనివాస్‌గౌడ్‌ను పార్సిగుట్ట వీరభద్రీయ కుల సంఘ నాయకులు అధ్యక్షుడు మిట్టపల్లి బాబురావు ఆధ్వర్యంలో శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. శ్రీనివాస్‌గౌడ్‌కు పుష్పగుచ్ఛాలు అందజేసి, శాలువా కప్పి ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా వీరభద్రీయ కులస్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వారు కోరారు.

మరో పదిరోజుల గడువు పొడిగింపు

● మర్రి పురురవారెడ్డి

బేగంపేట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): సభ్యత్వ నమోదుకు మరో పది రోజులు అధిష్ఠానం గడువు పొడిగించిందని సనత్‌నగర్ బీజేపీ యువ నాయకుడు మర్రి పురురవారెడ్డి అన్నారు. గురువారం రాత్రి బేగంపేటలోని పార్టీ కార్యాలయంలో పార్టీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఇంటికి వెళ్లి సభ్యత్వ నమోదుకు కృషి చేయాలన్నారు. సభ్యత్వ నమోదులో సనత్‌నగర్ నియోజకవర్గం ముందు వరుసలో ఉండాలని అన్నారు. సమావేశంలో నాయకులు వి. సత్యానారాయణ, కుమార్, రఘునాథ్‌గౌడ్, గోపి, గుంటి సత్యనారాయణ, వికాస్, శ్రీలత, నర్సింగ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై మురుగునీటి తొలగింపు పనులకు శ్రీకారం

● 'ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన జీహెచ్‌ఎంసీ

● మోటార్లను తీసుకొచ్చి శుభ్రం చేయించిన అధికారులు

అడ్డగుట్ట, అక్టోబరు 18 (ఆంధ్రజ్యోతి): ఆర్‌ఆర్‌సీ మైదాన్, లోహియానగర్ బస్తీలో రోడ్లపై నిలిచిన మురుగు నీటి తొలగింపు పనులకు జీహెచ్‌ఎంసీ అధికారులు శ్రీకారం చుట్టారు. ఈ నెల 17న 'ఎన్నాళ్లీ బాధలు' శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. శుక్రవారం ఆర్‌ఆర్‌సీ మైదాన్ వద్దకు మైదానానికి పెద్దపెద్ద వాటర్ మోటార్లను తీసుకొచ్చి మురుగునీటి తొలగించారు. ఇళ్లల్లోకి మురుగునీరు చేరకుండా జీహెచ్‌ఎంసి సిబ్బంది శుభ్రం చేశారు. ఆ పనులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాళ్లు రామలీల, లలితలు పరిశీలించారు. సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు, డివిజన్ కార్పొరేటర్ ప్రసన్నలక్ష్మిలు అడ్డగుట్ట సమస్యలు పట్టించుకోకపోవడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమస్యను పరిష్కరించేలా వార్తను ప్రచురించిన 'ఆంధ్రజ్యోతి'కి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్



ఆర్‌ఆర్‌సీ మైదానం వద్ద మురుగునీటిని మోటార్లతో బయటికి పంపిస్తున్న జీహెచ్‌ఎంసీ సిబ్బంది... పరిశీలిస్తున్న కాంగ్రెస్ మహిళా నాయకురాళ్లు

ట్రైనింగ్ సెంటర్ల పేరుతో ఉగ్రవాదులకు శిక్షణ

రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఏం చేస్తోందని ఈటల ఆగ్రహం

రెజిమెంటల్‌బజార్, అక్టోబరు 18(ఆంధ్రజ్యోతి): ట్రైనింగ్ సెంటర్ల పేరుతో ఉన్మాదులకు శిక్షణ ఇస్తుంటే రాష్ట్ర ఇంటెలిజెన్స్ ఏం చేస్తున్నదని మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం సికింద్రాబాద్‌లోని ముత్యాలమ్మ ఆలయాన్ని ఎంపీ ఈటల సందర్శించారు. ఆలయంలో చండీహోమం నిర్వహించగా అమ్మవారికి సాక సమర్పించాలని పురోహితులు సూచించడంతో మహిళలతో కలిసి ఎంపీ ఈటల అమ్మవారికి సాక సమర్పించారు. అనంతరం 31వ బస్టాప్ సమీపంలో ఉన్న ముత్యాలమ్మ అమ్మవారికి సాక సమర్పించారు. అనంతరం విలేకరుల సమావేశంలో ఈటల మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే ఉన్మాదులదాడిలో ఎంతో మంది ప్రాణాలు కోల్పోయారని, ఇప్పటి వరకు ఆరు ఆలయాలపై దాడులు జరిగినా రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని ఆరోపించారు. ఆలయంలో దాడి చేసిన నిందితుడు ఆస్పత్రిలో బెడ్ మీద దర్జాగా పడుకుని ఈ పని అల్లా చేయించాడని సోషల్ మీడియాలో పోస్టులు పెడుతున్నాడని అన్నారు. లా అండ్ ఆర్డర్ కాపాడాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదేనని, రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే కేంద్రం రంగంలోకి దిగాల్సి వస్తుందని హెచ్చరించారు. శనివారం జరిగే సికింద్రాబాద్ బంద్‌కు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని కోరారు. అమ్మవారి విగ్రహం ధ్వంసం అనంతరం రెండెంచల భద్రతలో పోలీసులు కొంతమేర శుక్రవారం ఆంక్షలు సడలించారు. ఆధార్ కార్డు లేదా ఇతర గుర్తింపు కార్డు చూసిన తరువాత ఆలయంలోకి అనుమతించారు.



మీడియాతో మాట్లాడుతున్న ఎంపీ ఈటల రాజేందర్